క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌లో 28 అర్జీల స్వీకరణ



నందిగామ రూరల్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బాలకృష్ణ ప్రజల నుంచి 28 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 10, సర్వే ఏడు, వెల్ఫేర్ రెండు, మున్సిపాలిటీ ఒకటి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఒకటి, పంచాయతీ రాజ్ రెండు, దేవదాయ శాఖ ఒకటి, సివిల్ సప్లయిస్ ఒకటి, ఎక్సైజ్ శాఖకు సంబంధించి ఒక అర్జీని స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖాధికారులకు పంపించి, క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



సుబ్బాయిగూడెం (పెనుగంచిప్రోలు): స్థానిక ఎస్సీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ.8 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజి నిర్మాణానికి సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ మోరంపుల పూర్ణయ్య, వైఎస్సార్ సీపీ మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ఆకార ఏసు, ఎం.గోపి, బూరెల వినోద్, రేగండ్ల రామకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణ పనులు ప్రారంభం



పెనుగంచిప్రోలు: స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో కళావేదిక పనులను సోమవారం విద్యా దాత స్వామి గోపాలరావు, హెచ్ఎం నక్కా బాబూరావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు నిర్మాణానికి స్థలం ఇవ్వటంతో పాటు, భవన నిర్మాణానికి నిధులు ఇచ్చిన గోపాలరావు అడిగిన వెంటనే పాఠశాలలో కళా వేదికను తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయటానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. గోపాలరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన ఆగంతకులు

నందిగామ టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తులు గొలుసు లాక్కెళ్లన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సేకరించిన, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన గుర్రం మనోహరిదేవి సోమవారం ఉదయం వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తోంది. పోస్టాఫీసు సమీపంలోకి వచ్చే సరికి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైకుపై వచ్చి మహిళ మెడలోని సుమారు రూ.ఏడు లక్షల విలువ చేసే 70 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని సీఐ వైవీఎల్ నాయుడు చెప్పారు.

చంద్రగ్రహణం వీక్షించిన విద్యార్థులు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెలిస్కోప్‌లో చంద్రగ్రహణంలోని వివిధ దశలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీ మోహన్ చంద్రగ్రహణం ఎలా ఏర్పడుతుంది.. రెడ్‌మూన్ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను వీడాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు వైఎస్సార్ సీపీ బాసట

- నేడు అన్నదాత పోరుబాట
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



పోస్టర్ ఆవిష్కరణలో ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి తదితరులు



చిల్లకల్లులో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో యూరియా, ఎరువుల కోసం రైతులు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి జిల్లా వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నందిగామ ఆర్డీవోకు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

పెనుగంచిప్రోలు: కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలా మోసం చేస్తోందని ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. పెనుగంచిప్రోలులో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై మంగళవారం నిర్వహిస్తున్న రైతు పోరును విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఉదయం నందిగామ గాంధీ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు జరిగే ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలకు గిటుబ్టు బాటు ధరలు లేవని, పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అనేది కలగా మారిందన్నారు. వ్యవసాయం దండగ అని చెప్పే చంద్రబాబుకు మొదటి నుంచి రైతులంటే చులకన భావం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు ఏసమస్య వచ్చినా జగనన్న వెంటనే స్పందిస్తూ ఆదుకుంటూ వచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు గడేటి పెద్దోడు, నియోజకవర్గ ఎస్సీసెల్, వాణిజ్య విభాగం, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కీసర లోకేశ్వరరావు, దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, రైతు నాయకులు చుంచు బెనర్జీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడిమెట్ల శంకర్, సుబ్బాయిగూడెం సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు శంకరరావు, ఎంపీపీ రమాదేవి

అన్నదాత పోరును విజయవంతం చేయండి

వత్సవాయి: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'అన్నదాత పోరు బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం వత్సవాయిలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందిగామ ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉదయం పది గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ మండల అధ్యక్షుడు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఎంపీపీ కొలుసు రమాదేవితిరుపతిరావు, జిల్లా పార్టీ నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, రూప్లానాయక్, వత్సవాయి గ్రామ పార్టీ అధ్యక్షుడు మిట్టకోలు నరేష్, కనకచందరరావు, చింతల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ నెల 9న నందిగామలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాతపోరు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ బూడిద నరసింహారావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రోజురోజుకు రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదన్నారు. బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలు విక్రయిస్తున్నప్పటికి పట్టించుకునే నాధుడే లేరన్నారు. నాయకులు మండవ శ్రీనివాసగౌడ్, దొంగల వెంకటేశ్వర్లు, మాతంగి వెంకటేశ్వర్లు, అన్నాబత్తుల శ్రీనివాసరావు, ఆదూరి కిషోర్, వీరభద్రం, పాతకోటి ఉదయభాను, ఇజ్రాయిల్, బజారు సాయి, జవ్వాజి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పాత బస్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ

కంచికచర్ల: నందిగామలో మంగళవారం ఉదయం 9గంటలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న 'అన్నదాత పోరు' కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ బండి మల్లిఖార్జునరావు సోమవారం కోరారు. నందిగామ పాత బస్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, తన్నీరు నాగేశ్వరరావు, నల్లగట్ల స్వామిదాసు పాల్గొంటారని తెలిపారు.

వైరా కట్టలేరును పరిశీలించిన ఎస్ఈ



వైరా కట్టలేరును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ, అధికారులు

వీరులపాడు: వైరాకట్టలేరు కాజ్‌వే రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని పల్లంపల్లి- కూడలి సమీపంలోని కాజ్‌వే రహదారిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలు, వర్షాలతో వైరాకట్టలేరు కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైందన్నారు. రెండు, మూడు రోజులలో రహదారి మరమ్మతులు చేపట్టటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈలు ఎస్. కృష్ణనాయక్, పరశురాం, ఏఈ కృష్ణకుమార్, సొసైటీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

నందిగామ రూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమరావతి కంటి ఆస్పత్రి, గాయత్రి హాస్పిటల్, వనమాలజీ హాస్పిటల్ వైద్యులు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 68 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించామని వైద్యులు జోష్టి, షర్లి, సురేష్, కృష్ణలు తెలిపారు. అనంతరం 55 మందికి కళ్లజోళ్లతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, సూరంపల్లి అప్పారావు, మన్నే కళావతి, తోట నాగమల్లేశ్వరరావు, చెరుకూరు హైమారావు, బత్తిన రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులను వెంటాడుతున్న యూరియా కష్టాలు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): రైతులను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. యూరియా కొరతపై రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. సోమవారం మండలంలోని ముచ్చింతాలకు 15 టన్నులు, నవాబుపేట సొసైటీకి 10 టన్నులు యూరియా వచ్చింది. రైతులు యూరియా కోసం పరుగులు పెట్టారు. సరిపడినంత యూరియా ఇవ్వటం లేదని, బయట దుకాణాల్లో కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని అంటున్నారని రైతులు వాపోతున్నారు. ఏఓ రామసుబ్బారెడ్డి రైతులతో మాట్లాడుతూ యూరియా అందరికీ ఇస్తామని మంగళవారం పెనుగంచిప్రోలు గ్రోమోర్, కొళ్లికూళ్ల సొసైటీలకు యూరియా వస్తుందన్నారు. రైతులు నానో యూరియా వాడకంపై దృష్టి పెట్టాలన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రామసుబ్బారెడ్డి



మంగొల్లు సొసైటీ వద్ద యూరియా కోసం నిల్చున్న రైతులు

2000 బస్తాల యూరియా పంపిణీ

వత్సవాయి: మండలంలోని నాలుగు ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు 2000 వేల యూరియా బస్తాలను సోమవారం పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తెలిపారు. భీమవరంలో 20 టన్నులు, పోలంపల్లిలో 45 టన్నులు, మంగొల్లులో 25 టన్నులు, కంభంపాడులో 5 టన్నులు మొత్తం 2000 బస్తాలను అందించినట్లు చెప్పారు. మండలంలో ఏడు ప్రైవేటు షాపుల లో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఏడు షాపులలో 117 టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. గతంలో రైతులకు ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని బస్తాలను తీసుకుని పొలానికి చల్లుకునేవారు, కానీ నేడు ఆ పరిస్థితులు లేవు, పాసుపుస్తకాలు తీసుకొని పనులు మానుకుని సొసైటీల వద్ద పడిగాపులు పడితేనే బస్తా దొరికే రోజులు వచ్చాయి. ఇటువంటి గడ్డు పరిస్థితులలో వ్యవసాయం చేయాలంటే భారంగా మారుతుందని రైతులు వాపోతున్నారు.

ఘనంగా వేళాంగిణి మాత జన్మదిన వేడుకలు



నందిగామ టౌన్: జీసెస్ శాంతి సందేశం సర్వజనులకు ఆచరణీయమైనదని రెవ.ఫాదర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో వేళాంగిణి మాత జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి సమీపంలోని డాన్‌బోస్కో పాఠశాల నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు పలు రకాలు పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వేళాంగిణి మాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ, దయ, కరుణతో నడుచుకోవాలన్నారు. ప్రేమమయుడైన ఏసు చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. రాత్రి రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీ హబ్‌లో చోరీ

రూ.లక్ష విలువైన సామగ్రి అపహరణ



నందిగామ రూరల్: మండలంలోని మునగచర్ల శివారులోని జాతీయ రహదారి వెంబడి ఉన్న ఘంటా టీ హబ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు మునగచర్ల గ్రామానికి చెందిన ఘంటా వెంకట్రావ్ టీ హబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం దయాన్నే వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దుకాణంలోని సామగ్రి చిందర వందరగా పడి ఉన్నాయని పరిసరాలలో రక్తపు మరకలు కనిపించటంతో కంగారు పడిన దుకాణదారుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం సభ్యులు వివరాలు సేకరించి బాధుతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు. దుకాణంలో రూ.లక్ష విలువ చేసే సిగరెట్లు, పలు రకాల సామగ్రి చోరీకి గురైందని వాపోయాడు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు



నాయకులను సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీలో వివిధ అనుబంధ విభాగాల్లో నియమితులైన నేతలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల కాలంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు సిఫార్సు మేరకు పార్టీ జిల్లా చేనేత విభాగం కార్యదర్శిగా షేర్ మహ్మద్‌పేట గ్రామానికి చెందిన దేవరశెట్టి వీరాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కన్నెవీడు గ్రామానికి చెందిన మేకా శ్రీనివాసరావు, జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఆదెపు వీరాస్వామి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వారిని తన్నీరు నాగేశ్వరరావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమకు ఈ పదవులు వచ్చినందుకు వారు తన్నీరు నాగేశ్వరరావును సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, తిరుమలగిరి గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిసె ఇశ్రాయేలు, పార్టీ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, నాయకులు కనకరాజు, వేల్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నందిగామలో న్యాయవాదులపై తరచూ అక్రమ కేసుల నమోదుకు నిరసన



నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



పేటలో కోర్టు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ రూరల్: న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయటం బాధాకరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్ పేర్కొన్నారు. న్యాయవాది కోట దేవదాస్‌పై అక్రమంగా కేసు నమోదు చేయటాన్ని నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి స్థానిక కోర్టు సముదాయంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామలో తరచూ న్యాయవాదులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. న్యాయవాది దేవదాసుకు ఎటువంటి సంబంధం లేకపోయినా పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయటమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయవాదులపై నమోదు చేసిన అక్రమ కేసులను తొలగించటంతో పాటు న్యాయవాదులకురక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు యర్రంరెడ్డి బాబూరావు, ఈశ్వరప్రగడ రంగారావు, బండి మల్లికార్జునరావు, వరదబోయిన విజయ్‌కుమార్, మందా వజ్రయ్య, చెరుకుమల్లి రామారావు, ఎక్కిరాల హనుమంతరావు,యరగొర్ల రామారావు, కొమ్మినేని మాలేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జగ్గయ్యపేట అర్బన్: నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాది కోట దేవదాసుపై పోలీసుల అక్రమ చర్యలను నిరశిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణ అమలుకు విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు సామినేని రాము, దాసరి నాగేశ్వరరావు, గోనెల వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసగౌడ్, ఎం.ఆంజనేయు లు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, దేశింగు రాజు, గంటా కృష్ణంరాజు, జగ్జీవన్‌రామ్, గురువులు రాజు, ప్రతాప్‌రెడ్డి, ఎం.నరేష్, అంకమరాజు, కిషోర్, పల్లపు రవి, బిక్షమయ్య, అమ్ములు పాల్గొన్నారు.

పాత మున్సిపల్ కార్యాలయ భవనం కూల్చివేత ఆపాలి

జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వినతి



మున్సిపల్ కమిషనర్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక పురపాలక సంఘ భవనం కూల్చివేత ప్రక్రియను నిలిపివేయాలని వైఎస్సార్ సీపీ 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఉన్నతాధికారులు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు మనోహర్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ మహానగరానికంటే ముందుగానే గ్రామ పంచాయతీగా ఏర్పడిన చరిత్ర కలిగిన గ్రామ పంచాయతీగా, నగర పంచాయతీగా, ఆ తరువాత పురపాలక సంఘ కార్యాలయంగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాత మున్సిపల్ భవనాన్ని ఉద్దేశపూర్వకంగా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర కౌన్సిల్ సభ్యులకు సమాచారం లేకుండా రాజకీయ అఖిలపక్ష పార్టీల సలహాలు, సంప్రదింపులు లేకుండా చట్టవ్యతిరేకంగా కూలగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత కొన్ని నెలల క్రితం కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర పాత భవనాన్ని కూల్చి, కొత్త భవనం నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించామని, కూల్చివేతకు డీపీఆర్ ఎస్టిమేషన్ కొరకు కౌన్సిల్ అనుమతి కావాలని సభ్యులను కోరారన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోయినప్పటికీ, ఎటువంటి జీవో లేకపోయినా, కనీసం లీజుదారుడుగా ఏదైనా సంస్థ వారు ఆన్‌లైన్ టెండర్ విధానం ద్వారా ఆ కొత్త భవనానికి ప్రతిపాదనలు అనుమతి పొందలేదన్నారు. వివరాలు కౌన్సిల్ సభ్యులకు కూడా తెలియజేయకుండా రాత్రికి రాత్రే పాత మున్సిపల్ భవనంలో ఉన్న సచివాలయాన్ని ఖాళీ చేయించారన్నారు. ఒకవేళ కొత్త భవనం నిర్మాణానికి నిధులు ఉంటే లిఖితపూర్వకంగా చూపించాలన్నారు. లేదంటే ఆన్‌లైన్ టెండర్ ద్వారా ఏ సంస్థ ఎన్ని ఏళ్లు ఈ స్థలాన్ని లీజుకు పొందిందో అధికారికంగా కౌన్సిల్ మీటింగ్‌లో చూపించి సభ్యుల అనుమతి ద్వారా నూతన భవన నిర్మాణం చేసుకుంటే మంచిదేనన్నారు. అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని, ఒక కౌన్సిల్ సభ్యుడిగా తాను కోరుతున్నానని తెలిపారు. ఈ లోగా ఎటువంటి చర్యలు చేపట్టినా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన



కంచికచర్ల పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

కంచికచర్ల: పలు హిందూ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కంచికచర్లలో హిందువులు బంద్ పాటించారు. ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. హిందూ సంఘాల ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. మండలంలోని పరిటాలలో ఈనెల 6వ తేదీ శనివారం వినాయకుడి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో హిందువులపై రాళ్ల దాడి జరగటం పలువురికి గాయాలయిన సంగతి విధితమే. దాడికి కారకులైన వారిపై కేసులు నమోదు చేయాలంటూ హిందువులు ఆందోళన చేపట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అరెస్ట్ చేసిన తమ వారిని విడిచిపెట్టాలని, దళితులమైన మాపై కేసు పెడతారా అంటూ వారు ఆదివారం రాత్రి వరకు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేసి బైఠాయించారు. తమపై హిందువులు దాడి చేశారంటూ 15 మందిపై ఫిర్యాదు చేయటంతో పోలీసులు 15 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఆదివారం అర్ధరాత్రి వదలిపెట్టారు. దీంతో సోమవారం హిందూ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. కంచికచర్ల, పరిటాల గ్రామంలో ప్రదర్శన చేశారు. దుకాణాలు, బడ్డీ కొట్లు, టీ దుకాణాలు, బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలను బంద్ చేశారు. రాళ్ల దెబ్బలు తిన్న తమపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయటం ఎంతవరకు సమంజసమని పోలీసుల తీరుపై మండిపడ్డారు. మూడు గంటల పాటు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపాలని డిమాండ్ చేశారు. హిందువుల సంఘాల నాయకులు, పోలీసులు పలు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ చర్చలు ఫలించకపోవటంతో మండలంలోని పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నందిగామ ఏసీపీ కేబీజీ తిలక్, రూరల్ సీఐ చవాన్, ఎస్ఐ విశ్వనాథ్ హిందూ సంఘ నాయకులతో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు.

పరిటాల నేషనల్ హైవేపై..

కంచికచర్ల: పై డిమాండ్ల కోసం హైందవ సంఘ ప్రతినిధులు పరిటాల జాతీయ రహదారిపై సోమవారం రాత్రి మరోసారి ఆందోళన చేపట్టారు. దీంతో విజయవాడ-హైద్రాబాద్ జాతీయ రహదారిపై గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు నచ్చచెప్పి తగు చర్యలు తీసుకుంటామని నందిగామ ఏసీపీ తిలక్ అనటంతో ఆందోళన విరమించారు.

'తిలకధారణ' లైసెన్స్ హక్కు వేలం వాయిదా

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద భక్తులకు తిలకధారణ చేయు లైసెన్స్ హక్కునకు ఈనెల 19న నిర్వహించతలపెట్టిన బహిరంగ వేలంను అనివార్య కారణాల వలన వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ కిషోర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తిలకధారణ హక్కులను కాంట్రాక్ట్‌కు ఇచ్చే విషయమై ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గంతో పాటు భక్తులు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి విధానాలు వదిలేయాలన్నారు.